క్లుప్తంగా

గడువులోగా కులగణన పూర్తి



సీతానగరంలో కులగణనను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సీతానగరం: మండలంలో జరుగుతున్న కులగణన నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేలా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను సిద్ధం చేశామని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. పెదబోగిలి పంచాయతీలో ఉన్న సీతానగరం, అప్పయ్యపేట, బుడ్డిపేట, పెదబోగిలి గ్రామాల్లోని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు నిర్వహిస్తున్న కులగణనను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీరాజ్ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సహకారంతో ఇంటింటికీ వెళ్లి కులగణన కార్యక్రమం చేస్తున్నారన్నారు. కులాల ఆధారంగానే ఉపాధి, అభివృద్ధి పనులు కేటాయించడం జరుగుతుందన్నారు. పంచాయతీ ఈఓ జె.వెంకటరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ ప్రవేశాల కోసం డ్రైవ్



పార్వతీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అధ్యాపకులు 7 బృందాలుగా ఏర్పడి, పార్వతీపురం పరిసరాలలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వెళ్లి ప్రభుత్వ కళాశాల పార్వతీపురంలో జాయిన్ కావాలని 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను అధ్యాపకులు కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.రవికుమార్, ఎస్.శ్రీనివాసరావు, సుకన్య, శాంతి, ధనలక్ష్మి, లక్ష్మణరావు, రామకృష్ణ, సత్యనారాయణ, శర్మ, శివ, కైలాష్, రవికాంత్, డీటీ నాయుడు, తేజ, వెంకటేశ్వరరావు, బాబ్జీరావ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం

సాలూరు: మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం లోపించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, కమిషనర్ జయరాం ఆధ్వర్యంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అజెండాలోని అంశాలను సభ్యులు ఆమోదించారు. మున్సిపాలిటిలో సమస్యలు, అభివృద్ధి పనులు, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ఫ్లోర్ లీడర్ గొర్లె జగన్మోహనరావు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పాచిపెంట జట్టు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జట్టుతో ఎంపీడీఓ లక్ష్మీకాంత్, అధికారులు

పాచిపెంట: 'ఆడుదాం ఆంధ్రా' రాష్ట్రస్థాయి పోటీలకు పాచిపెంట మహిళల క్రికెట్ జట్టు ఎంపికైంది. పార్వతీపురంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో పాచిపెంట మహిళల క్రికెట్ జట్టు కురుపాం మహిళల జట్టుపై విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ లక్ష్మీకాంత్ తెలిపారు. విజేతలను ఎంపీడీఓతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా సత్తా చాటాలని ఆకాంక్షించారు.

లుంబేసులో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులకు సర్పంచ్ తోయక చిలకమ్మ, ఎంపీటీసీ మండంగి గౌరమ్మ బుధవారం భూమిపూజ చేశారు. లుంబేసు గ్రామంలోని ప్రతీ ఇంటికి తాగునీరు అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జలజీవన్ మిషన్ కింద రూ.12.75 లక్షలు మంజూరు చేశారన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సచివాలయం బూత్ కన్వీనర్ తోయక గోపాల్, వైస్ సర్పంచ్ రామారావు, తదితరులు ఉన్నారు.

ప్రజా నాయకుడు ఎవరో ప్రజలే నిర్ణయిస్తారు...

- నాల్గో విడత ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే జోగారావు



చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ప్రజలకు మేలు చేసే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావాలో.. కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసగించే చంద్రబాబు కావాలో వచ్చే ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. మండలంలోని వెంగాపురం సచివాలయ పరిధిలో నాల్గో విడత ఆసరా వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగు విడతల్లో 1315 గ్రూపులకు సంబంధించి 14,789 మంది సభ్యులకు రూ.30.41 కోట్లు చెల్లించినట్టు తెలిపారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు ప్రజలను మోసం చేస్తే... ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు అమలు చేస్తూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు తన వంతు కృషి చేస్తున్నారన్నారు. పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేశారన్నారు. మహిళలకు కుటుంబాలకు సారథుల్లా పని చేస్తుంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారికి వారధిలా ఉంటూ అన్ని రంగాల్లో మహిళలను అందలం ఎక్కిస్తున్నారన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. అమ్మఒడి, గోరుముద్ద, నాడు – నేడు పథకాలతో పాఠశాలలను సమూలంగా మార్పు చేసిన గొప్ప మానవతావాది జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. చంద్రబాబు హయాంలో ప్రభుత్వ పథకాలు జన్మభూమి కమిటీల ద్వారా అందేవని, వాటిలో టీడీపీ శ్రేణులు అక్రమాలకు పాల్పడేవారన్నారు. ఈ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా వలంటీర్లతో నేరుగా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం ఫలాలు అందిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందజేస్తున్నారని తెలిపారు. జగనన్న పాలనలో ప్రజలకు మేలు జరిగిందని అనుకుంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ అండగా నిలబడి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని కోరారు. సర్పంచ్ జి.అమ్మడమ్మ, ఎంపీపీ నాగమణి, జడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, మండల సమాఖ్య అధ్యక్షురాలు మేరీ, ఎంపీడీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఎంతో మేలు...



రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వైఎస్సార్ ఆసరా, బ్యాంకు లింకేజీ, నవరత్నాలు పథకాలతో ఎంతో లబ్ధి పొందాను. పిండి మిల్లు పెట్టుకున్నాను. పాడి ఆవులతో వ్యాపారం చేసుకుంటున్నాను. ఎంతో మేలు జరిగింది.

– షేక్ అరుణ, శివరాంపురం, బలిజిపేట

స్వశక్తిపై జీవిస్తున్నాను..



వైఎస్సార్ ఆసరా ద్వారా వచ్చిన డబ్బులతో కుట్టు మిషన్ కొన్నాను. డ్వాక్రా రుణాలతో వ్యాపారం చేసుకుంటున్నాను. జీవితాన్ని హాయిగా గడుపుతున్నానంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చలువే..

– పార్వతి, బలిజిపేట



సమావేశానికి హాజరైన మహిళలు



ఆకట్టుకున్న మహిళల కోలాటం

లెప్రసీ రోగులను చేరదీయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యశాఖ అధికారులు, సిబ్బంది, ప్రజలు

బలిజిపేట: లెప్రసీ రోగులను చేరదీయాలని, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి తెలిపారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మండలంలో నిర్వహిస్తున్న స్పర్శ కార్యక్రమంలో భాగంగా చిలకలపల్లి సచివాలయంలో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు ఉంటే వాటిని వెంటనే పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. సమాజంలో ఎవరు ఏమనుకుంటారో అనే భావనతో ఇటువంటి వ్యాధులను దాచుకోకూడదని సూచించారు. లెప్రసీ రోగులు ఉన్నా వారిని అందరం ఆదరించాలన్నారు. వ్యాధి సోకిన వెంటనే వైద్యం చేయించుకుంటే ఎటువంటి ప్రమాదం ఉండదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.సుందరరావు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రబీ పంటల ఈ నమోదుకు సహకరించాలి

- ఆర్‌డీఓ హేమలత

సీతానగరం: మండలంలోని నీటి వనరులున్న గ్రామాల్లో రైతులు రబీ పంటలు సాగు చేస్తున్న భూములలో వ్యవసాయాధికార సిబ్బంది చేస్తున్న ఈ పంట నమోదును ఆర్‌డీఓ కె.హేమలత బుధవారం పరిశీలించారు. ఈ మేరకు చినబోగిలిలో జొన్న పంటను పరిశీలించిన ఆర్‌డీఓ మాట్లాడుతూ వ్యవసాయ పంట భూముల్లో వ్యవసాయ సిబ్బంది చేస్తున్న ఈ పంటల నమోదును వేగవంతం చేయాలని, ఈ పంట నమోదు చేయడం వల్ల విపత్కర పరిస్థితుల్లో పంటల నష్టం వాటిల్లినా రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు బీమా వర్తిస్తుందన్నారు. పొలాల్లో వ్యవసాయ సిబ్బంది నిర్వహిస్తున్న ఈ పంట నమోదులో భాగంగా రైతులు వ్యవసాయ సిబ్బందికి సమగ్రమైన సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఆమె వెంట తహసీల్దార్ ఎన్వీ రమణ, మండల ఏఓ ఎస్.అవినాష్, వీఆర్‌ఓ లక్ష్మీ దేవి, వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల పరిశీలన



మాట్లాడుతున్న ఆర్‌డీఓ హేమలత

సీతానగరం: మండలంలోని పలు పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆర్‌డీఓ కె.హేమలత బుధవారం పరిశీలించారు. మండలంలోని సీతానగరం, బూర్జ, లక్ష్మీపురం, చెల్లంనాయుడువలస, వెంకటాపురం, గుచ్చిమి, చినబోగిలి, జోగింపేట, తామరఖండి, బక్కుపేట గ్రామాల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ఎంఆర్‌సీ భవనం వద్ద ఆర్‌డీఓ మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓటు వేసేందుకు పాల్గొనే ఓటర్లకు అవసరమైన వసతులు కల్పించాల్సి ఉందన్నారు. ఓటింగ్‌లో పాల్గొనే వృద్ధులకు పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేసేందుకు వెళ్లడానికి ర్యాంప్‌లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర అంశాలు పరిశీలించినట్టు తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్, ఎంఈఓ–1 సూరిదేముడు, ఎంఈఓ–2 ఎమ్వీ రమణ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, వీఆర్వోలు, బీఎల్వోలు, సచివాలయ ఉద్యోగులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలి

బలిజిపేట: పెదపెంకి మూడు పాఠశాలల పరిధిలో ఉండే పోలింగ్ స్టేషన్లలో యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహించాలని ఎంఈఓ – 1 సామల సింహాచలం సూచించారు. సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఒకటవ నంబరు పాఠశాల వద్ద రోడ్డు సదుపాయం లేదని దానిని పూర్తి చేయాలన్నారు. రెండవ నంబరు పాఠశాలలో మరుగుదొడ్ల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. మూడవ నంబరు పాఠశాల వద్ద ర్యాంప్, తాగునీటి సదుపాయాన్ని సంపూర్ణం చేయాలని తెలిపారు. పలగర గుడివాడ కాలనీ పాఠశాల వద్ద పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డీఓ హేమలత సూచనల మేర అన్ని పనులు పూర్తి చేయిస్తున్నామన్నారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



పెదపెంకిలో సచివాలయంలో సిబ్బంది, బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఎంఈఓ

క్రమశిక్షణతో చక్కని జీవితం



ఐసీడీఎస్ పీడీ రాణి

పార్వతీపురం టౌన్: క్రమశిక్షణతో చక్కని జీవితం పొందవచ్చునని జిల్లా మహిళ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఎంఎస్ రాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలకు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాలికలకు సంబంధించిన చట్టాలు గూర్చి అవగాహన కల్పించడం జరిగింది. జిల్లా మహిళ శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఎంఎస్ రాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలను, ఆరోగ్య పరంగా వచ్చే సమస్యలను వివరించారు. చదువుకొనే వయస్సులో విద్యార్జన పట్ల శ్రద్ధ వహించాలని, జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణామీద అవగాహన కల్పించారు. చెడు స్పర్శ, మంచి స్పర్శ గూర్చి అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపక సిబ్బంది, జిల్లా బాలల సంరక్షణ విభాగం సంరక్షణ అధికారులు పి.శ్రీధర్, ఎస్.ప్రసాదరావు, ఎం.ఎ.నాయుడు, సోషల్ వర్కర్, ఎస్.దేవి, కౌన్సిలర్, జి తవిటినాయుడు, అవుట్ రీచ్ వర్కర్ ఆర్.హరికృష్ణ, బి.అనిల్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చిన సీఎం జగన్



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: పేదల సొంత ఇంటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం పురపాలక సంఘం 1, 29, 30 వార్డులకు చెందిన హౌసింగ్ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే చేతులు మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జగనన్న లేఅవుట్లలో స్థలాలు వచ్చిన వారికి ఆ లేఅవుట్ రద్దు కావడంతో అక్కడి వారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెంకంపేట ప్రాంతంలో గల జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలను గతంలో మంజూరు చేశామన్నారు. నాడు అక్కడ ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు అందరికీ ఎమ్మెల్యే పట్టాలు చేయించి వార్డుల వారీగా వారిని గుర్తించి నేరుగా వారి వద్దకే వెళ్లి ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ ఆర్ చిన్నంనాయుడు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ జి.మాధవరావు గృహ సారథులు, కార్యకర్తలు, వలంటీర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక గ్రంథాలయాల ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం: జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రత్యేక చొరవతో మండలంలోని మండ, గుమ్మలక్ష్మీపురం గ్రామ సచివాలయాల్లో అభిలాష సామాజిక గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. గుమ్మలక్ష్మీపురంలో సర్పంచ్ గౌరీశంకరరావు బుధవారం ఈ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. గ్రూప్–1,2 పరీక్షలతో పాటు టెట్, డీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ వంటి ఇతర పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

టెన్త్ పరీక్షలకు సిద్ధంకండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురం టౌన్: ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి పదో తేదీన జిల్లా వ్యాప్తంగా ప్రజ్ఞా వికాసం పరీక్ష నిర్వహించనున్నట్టు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో పరీక్షకు సంబంధించిన కరపత్రాలను బుధవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తోట రమేష్ మాట్లాడుతూ ప్రధాన పరీక్షల్లో పదో తరగతి పరీక్షలు కీలకమని అన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిళ్లకు గురి కాకుండా చదవాలని సూచించారు. పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో ప్రైజ్‌మనీ రూ.ఐదు వేలు, రూ.3వేలు, రూ.2వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. మండల స్థాయిలో 200 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే మొదటి మూడు స్థానాలకు మెమొంటోలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫ్రిబవరి 7వ తేదీలోగా రూ.25లు ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సూర్యపీఠం వార్షికోత్సవంలో ఎమ్మెల్యే



సూర్యభగవానునికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో కొలువైన సూర్యపీఠం వార్షికోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్న సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన చేతుల మీదుగా ఆలయం కార్యక్రమాలు ఆహ్వాన పత్రికలను ఇతర పెద్దలు, అర్చకులతో కలిసి విడుదల చేశారు. సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురం టౌన్: ప్రజలు అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కలిగి వుండి చుట్టుపక్కల వారిని చైతన్యవంతులుగా చేసి ప్రమాదాల నియంత్రించవచ్చునని జిల్లా రవాణా శాఖాధికారి సి.మల్లికార్జున రెడ్డి అన్నారు. రహదారి భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలకు కారణమయ్యే గాలి, మండే పదార్థం, వేడి ఈ మూడింటిలో ఒక దానిని అదుపుచేస్తే ప్రమాదాలు నియంత్రించవచ్చునన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తదితర ప్రమాదాలు ఏ విధంగా ఎదుర్కొవాలో తెలియజేశారు.

కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖాధికారి సి.మల్లికార్జున రెడ్డి, ఎంవీఐ శశికుమార్, ఏఓ జి.సీతారాం, అగ్నిమాపక అధికారి పి.పైడిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ శాఖ తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్‌శాఖ అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతితో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎంపీపీ బి.ఆదినారాయణ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే కళావతి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో లోటుపాట్లపై అధికారులను ప్రశ్నించారు. దాసుగుమ్మడ–కుసుమూరు రహదారి పనులు పూర్తిస్థాయిలో చేయలేదని, కేవలం మెటీరియల్ వేసి వదిలేశారని ఎంపీటీసీ కోటేశ్వరరావు, సర్పంచ్ వెంకునాయుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పనులు చేయకుండా రూ.50 లక్షల నిధులు ఎలా చెల్లించారని ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. పనులు చేయించలేకపోతే సెలవు పెట్టి వెళ్లిపోండని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేరే కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదని డీఈ కృష్ణకుమార్, ఏఈ నాగభూషణం తెలిపారు. పనులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దేవనాపురం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో లబ్ధిదారులకు సకాలంలో పౌష్టికాహారం పంపిణీ చేయకపోవడంపై వైస్ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అధికారులను నిలదీశారు. ఏజెన్సీలో మరోసారి భూముల సర్వే చేయించాలని సర్పంచ్‌లు హెచ్.ఆదిలక్ష్మి, జె.సుందరమ్మ కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ మ్యూటేషన్లు, ఇతర సమస్యలపై చర్చించాలని ఎంపీపీ ఆదినారాయణ డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్రప్రసాద్‌కు సూచించారు. చేపల పెంపకాన్ని ప్రభుత్వం పోత్సహిస్తోందని, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో మత్స్యకార సొసైటీలు ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. సబ్సిడీపై గిరిజన రైతులకు యంత్రపరికరాలు సప్లై చేయాలని ఎంపీటీసీ హరిబాబు కోరగా.. హార్టికల్చర్ ద్వారా అందిస్తున్నారని వ్యవసాయాధికారి శ్రీదేవి సమాధానమిచ్చారు. ఆరోగ్యశ్రీ కార్డులు, సికిల్‌సెల్ ఎనీమియా రక్తపరీక్షల వంటి వాటిపై మర్రిపాడు, దోనుబాయి వైద్యాధికారులు సాయిచరణ్, భానుప్రతాప్ వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్.లక్ష్మి, ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్డీ కె.సత్యం, సీడీపీఓ రంగలక్ష్మి, ఎంఈఓ ఆనందరావు పాల్గొన్నారు.